8న ప్రత్యేక సెమినార్‌

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ప్రత్యేక సెమినార్‌ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఆదివారం నిర్వహించే సండే ఈవినింగ్‌ టాక్‌, బాల బృందావనం రెండు కార్యక్రమాలను కలిపి ప్రత్యేక సెమినార్‌ను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శాంతిసరోవర్‌లోని గ్లోబల్‌ పీస్‌ ఆడిటోరియంలో నిర్వహిస్తారు.'వ్యాపార వ్యూహం, సక్సెస్‌ కోసం పర్సనల్‌ ఎక్సలెన్స్‌' అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లేష్‌

పటాన్‌చెరు టౌన్‌: యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తగొల్ల మల్లేష్‌ యాదవ్‌ ఎన్నికైనట్లు యూత్‌ కాంగ్రెస్‌ ఎన్నికల నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన మల్లేష్‌ యాదవ్‌ మాట్లాడుతూ... యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మొత్తం 20 మంది అభ్యర్థులు పోటీ పడగా అందులో 1090 ఓట్లతో గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

చలో బస్‌ భవన్‌

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో నుంచి పలువురు గురువారం చలో బస్‌ భవన్‌కు తరలి వెళ్లారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని నాయకులు డిమాండ్‌ చేశారు. ఉద్యోగుల రిక్రూట్‌మెంట్‌ పెంచాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.



'ఆహా' అనేలా...



వంటల తయారీలో మెళకువలు నేర్చుకుంటున్న మహిళలు

రుచికరమైన ఆహార పదార్థాల తయారీపై ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వాహకులకు నిథమ్‌లో ప్రత్యేక శిక్షణ

రాయదుర్గం: మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు ఏర్పాటు చేయనుంది. వీటి నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకే అప్పగించింది. అయితే ఈ క్యాంటీన్ల నిర్వాహక మహిళలకు పదిరోజులపాటు నాణ్యమైన ఆహార తయారీపై ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని భావించింది. అందులో భాగంగా గచ్చిబౌలిలోని నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజమ్‌ అండ్‌ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ (నిథమ్‌) ఆధ్వర్యంలో నిష్ణాతులైన చెఫ్‌ల పర్యవేక్షణలో 4 విడతలుగా 10 రోజుల పాటు 109 మందికి శిక్షణ ఇచ్చారు.

ప్రత్యేక శిక్షణ ఇచ్చిన 'నిథమ్‌ చెఫ్‌'లు

నిథమ్‌లోని హాస్పిటాలిటీ బ్లాక్‌లో ఆహార



పదార్థాల తయారీపై నిథమ్‌లో ప్రముఖ చెఫ్‌, ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ గణేష్‌ పర్యవేక్షణలో ఒక్కోబ్యాచ్‌లో ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా వివిధ రకాల అన్నం, రకరకాల టీ, కాఫీ తయారీ కాకుండా తెలంగాణలోని పలు రకాల స్నాక్స్‌, స్వీట్లు, బేసిక్‌ గ్రేవీలు, ముఖ్యంగా పొడులు, వెజ్‌, బిర్యానీ తయారీపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చివరి రోజు వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యం



రాష్ట్రంలో సెల్ఫ్‌హెల్ప్‌ గ్రూప్‌ మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగా ప్రతి జిల్లా నుంచి ఎంపికైన వారికి 10 రోజుల శిక్షణ ఇప్పించాం. నాలుగు విడతల్లో ఇప్పటివరకు 109 మంది మహిళలకు వంటకాల తయారీ, క్యాంటిన్‌ నిర్వహణ, పరిసరాల శుభ్రతలో శిక్షణ ఇచ్చాం.

–మిషెల్లీ జే ఫ్రాన్సిస్‌, నిథమ్‌ ట్రైనింగ్‌ కన్సల్టెన్సీ, ప్లేస్‌మెంట్‌ ఆఫీసర్‌

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం



రాష్ట్రంలో ప్రభుత్వం క్యాంటీన్ల నిర్వాహక మహిళలకు శిక్షణ ఇచ్చే అవకాశం 'నిథమ్‌'కు ఇవ్వడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. బల్క్‌ ఆహార పదార్థాల తయారీలో శిక్షణ ఇవ్వడంతోపాటు వారితోనే తయారు చేయించాం. తరగతి గదుల్లో బోధన తరహాలో క్లాసులు కూడా తీసుకున్నాం. వీడియోల ద్వారా అవగాహన కల్పించాం. గతంలో యువతకు శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం మహిళలకు ఇస్తున్నాం. శిక్షణలో నిథమ్‌ను ఒక బ్రాండ్‌గా రూపొందించాం.

– డాక్టర్‌ గణేష్‌, ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ గణేష్‌, సెర్ప్‌ అధికారులు



వివిధరకాల స్నాక్స్‌



శిక్షణ పొందిన మహిళలతో నిథమ్‌ చెఫ్‌లు

ముగిసిన నర్సింగ్‌ సొసైటీ సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని యశోద ఆసుపత్రిలో ఇన్‌ఫ్యూజన్‌ నర్సింగ్‌ సొసైటీ (ఐఎన్‌ఎస్‌) ఆధ్వర్యంలో జరుగుతున్న 12వ వార్షిక సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమంలో ఇన్‌ఫ్యూజన్‌ థెరపీ, నర్సింగ్‌కేర్‌కు సంబంధించి వైద్యపరంగా వస్తున్న అత్యాధునిక టెక్నిక్స్‌, ఆవిష్కరణలపై చర్చలు, క్విజ్‌లు, వర్క్‌షాప్స్‌, ఉపన్యాసాలు జరిగాయి. ఈ సదస్సులో యశోద ఆసుపత్రి డైరెక్టర్‌ డా.పవన్‌ గోరుకంటి, వైద్య నిపుణులు డా.దిలీప్‌కుమార్‌, ఐఎన్‌ఎస్‌ ఇండియా అధ్యక్షులు డా.బినూశర్మ తదితర వైద్య రంగ ప్రముఖులు పాల్గొన్న ఈ సదస్సులో దాదాపు 1200కి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

8న క్యాన్సర్‌ వ్యాధి నిర్ధారణ శిబిరం

పటాన్‌చెరు: పై హెల్త్‌ క్యాన్సర్‌ హాస్పిటల్‌ సౌజన్యంతో క్యాన్సర్‌ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ ఎదురుగా ఉన్న సాయిగణేష్‌ హాస్పిటల్‌ వద్ద ఏర్పాటు చేసే శిబిరంలో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. పురుషులకు జనరల్‌ బాడీ చెకప్‌, ఊపిరితిత్తుల పరీక్షతో పాటుగా ప్రోస్టేట్‌ క్యాన్సర్‌ పరీక్ష పీఎస్‌ఏ పరీక్షలు చేయనున్నారు. అలాగే మహిళలకు క్యాన్సర్‌ పరీక్షలను ఉచితంగానే చేయనున్నామని హాస్పిటల్‌ ప్రతినిధులు తెలిపారు. మరిన్ని వివరాలకు 92814 48102 , 99899 30014 లను సంప్రదించవచ్చు.

మంత్రులకు ఆహ్వానం



మంత్రి సీతక్కను సన్మానించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు జి. సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఐఎన్‌టీయూసీ అఫ్లియేటెడ్‌ యూనియన్‌ కాన్ఫరెన్స్‌ సమావేశాన్ని రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి రావాలంటూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ గౌడ్‌, రాష్ట్ర పంచాయతీ రాజ్‌ శాఖ మంత్రి సీతక్కకు గురువారం సెక్రటేరియట్‌లో ఆహ్వానపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ వి.భాస్కర్‌ రెడ్డి, ఎరగాని నాగన్నగౌడ్‌, విజయ్‌కుమార్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



కలెక్టర్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్‌: రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని కలెక్టర్‌ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు ఎంసీపీఐయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శివర్గ సభ్యులు అంగడి పుష్ప మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి సంవత్సరం అవుతున్నా ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శివర్గ సభ్యులు ఇస్లావత్‌ దశరథ్‌ నాయక్‌, కమిటీ సభ్యులు నారాయణ, పార్టీ సభ్యులు ఇషాక్‌ తదితరులున్నారు.

నేడు టీ–హబ్‌ ఫౌండేషన్‌ డే



రాయదుర్గం: హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో 9వ ఫౌండేషన్‌ డేను శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. టీహబ్‌ ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే వ్యవస్థాపక దినోత్సవంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, సైయంట్‌ వ్యవస్థాపక చైర్మన్‌ బీవీఆర్‌ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌, టీహబ్‌ తాత్కాలిక సీఈఓ సుజిత్‌ జాగిర్దార్‌ పాల్గొంటారని టీహబ్‌ అధికారులు తెలిపారు. టీహబ్‌ 9వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని డిఫెన్స్‌, ఏరోస్పేస్‌ రంగాలకు అంకితమైన అత్యాధునిక ఆవిష్కరణలకు వేదికగా 'టీ డ్రైవ్‌'ను ప్రారంభిస్తారు.అలాగే కార్పొరేట్లు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ వాటాదారులతో సహకారాన్ని ప్రోత్సహించే ఇంటరాక్టివ్‌ డిజిటల్‌ డిస్‌ప్లేలను అందిస్తూ, 20కి పైగా స్టార్టప్‌లనుంచి సంచలనాత్మక పరిష్కారాలను ప్రదర్శించడానికి రూపొందించబడిన అత్యాధునిక సదుపాయంగా అనుభవ కేంద్రం 2.0ను ప్రారంభిస్తారు. ఇంకా మెరిడియన్‌ డేటా ల్యాబ్స్‌, తేనె గూడు, రక్షణ, స్మార్ట్‌ నగరాల వంటి పరిశ్రమల కోసం జెన్‌ఏఐ–నడిచే వేదికను ప్రారంభిస్తారు.

గంజాయి, హష్‌ ఆయిల్‌ సీజ్‌..ముగ్గురు అరెస్ట్‌



చందానగర్‌లో సీజ్‌ చేసిన హష్‌ ఆయిల్‌.. నిందితుడితో ఎస్‌టీఎఫ్‌ ఎక్సైజ్‌ పోలీసులు



గచ్చిబౌలిలో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్‌ చేసిన శంషాబాద్‌ ఎక్సైజ్‌ పోలీసులు

చందానగర్‌ : శేరిలింగంపల్లి ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 1.5 కిలోల హష్‌ ఆయిల్‌ను సీజ్‌ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం హైదరాబాద్‌కు హష్‌ ఆయిల్‌ తరలిస్తున్నట్లు ఎక్సైజ్‌ పోలీసులకు సమాచారం అందడంతో ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ అంజిరెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌టీఎఫ్‌ 1 బృందంలోని సీఐ చంద్రశేఖర్‌, ఎస్‌ఐ భరతకుమార్‌లు చందానగర్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో తనిఖీలు చేయగా ఓ కారులో 1.5 కేజీల హష్‌ ఆయిల్‌ లభించింది. దాని విలువ రూ.5 లక్షలు ఉంటుందన్నారు. కర్ణాటకకు చెందిన కొండే మల్లికార్జున్‌, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్‌ రహమాన్‌ఖాన్‌లను అరెస్ట్‌ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒడిశాకు చెందిన రమేష్‌, గంగాధర్‌లకు సంబంధం ఉన్నట్లు తేలడంతో వీరిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్‌టీఎఫ్‌ పోలీసులు తెలిపారు. ఈ దాడులలో పాల్గొన్న అధికారులను ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టర్‌ వీబీ. కమలాసన్‌రెడ్డి అభినందించారు.

గచ్చిబౌలిలో...

గచ్చిబౌలిలోని డైమండ్‌హిల్స్‌లో గంజాయి తరలిస్తున్నట్లు శంషాబాద్‌ డీటీఎఫ్‌ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు వెంటనే గచ్చిబౌలిలోని డైమండ్‌ హిల్స్‌లో సోదాలు చేయగా ఓ ఇంట్లో 820 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయి విక్రయిస్తున్న ఒడిశాకు చెందిన దేబేంద్ర నాయక్‌ (30)ను అరెస్ట్‌ చేశారు. శేరిలింగంపల్లి ఎక్సైజ్‌ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మరో నిందితుడు బిక్రం హీరా పరారీలో ఉన్నాడు. ఈ దాడులలో సీఐ ప్రవీణ్‌కుమార్‌, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ కూడలి ప్రారంభం

మాదాపూర్‌: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామం సమీపంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం కూడలిని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌, తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌ మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీలు మోహన్‌రెడ్డి, ముకుందరెడ్డి, కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు రఘునాథ్‌యాదవ్‌, శ్రీనివాస్‌యాదవ్‌, సమ్మారెడ్డి, సత్యనారాయణరావు, శ్రీనివాస్‌, పింటు పాల్గొన్నారు.



కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 40, బెండ 40, కాకర 40, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్‌ 50, బీట్‌రూట్‌ 50, క్యాప్సికమ్‌ 50, క్యాబేజీ 30, క్యారెట్‌ 70, చిక్కుడు 50, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 40 , క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 400.

ఎస్‌బీఐ రివార్డ్స్‌ పేరిట సైబర్‌ మోసం


రూ. లక్షాడెబ్బై వేలు పోగొట్టుకున్న యువకుడు

పటాన్‌చెరు టౌన్‌: ఎస్‌బీఐ రివార్డ్స్‌ పేరిట ఓ యువకుడు నుంచి రూ. లక్షా 70 వేలు కాజేశారు సైబర్‌ నేరగాళ్లు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ఎం.జీ రోడ్డుకు చెందిన ఓ యువకుడికి గత నెల 24 వ తేదీన ఎస్‌బీఐ రివార్డ్స్‌ పేరుతో ఫోన్‌కాల్‌ రాగా వారు చెప్పిన విధంగా యాప్‌ను డౌన్‌ లోడ్‌ చేసి అతని వివరాలు నమోదు చేయగా వెంటనే అతని క్రెడిట్‌ కార్డు నుండి రూ. ఒక లక్ష 70 వేలు డ్రా అయినట్లు మెసేజ్‌ వచ్చింది. దీంతో యువకుడు వెంటనే సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌.. ఐదుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో ఐదుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 5 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేత



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్‌ దీనబంధు కాలనీకి చెందిన బేగరి సరోజ, శివ నగర్‌కు చెందిన తమ్మలి శ్రీనివాస్‌లకు వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను కాంగ్రెస్‌ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్‌ గురువారం బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, దత్తులూరి అశోక్‌, మాచర్ల విష్ణు, రఘు గౌడ్‌, శంకర్‌రావు, పరశురాం,అరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

శేరిలింగంపల్లి తహశీల్దార్‌ కార్యాలయం వద్ద బీజేపీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు రవికుమార్‌ యాదవ్‌, కార్యకర్తలు


శేరిలింగంపల్లి: కాంగ్రెస్‌ ప్రభుత్వం 6 గ్యారెంటీలు, 66 మోసాలతో ఏర్పడిందని బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్‌ ఎం.రవికుమార్‌ యాదవ్‌ విమర్శించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్‌ మాట్లాడుతూ ఏడాది కాలంలో రాష్ట్రంలో ఏం సాధించారని సంబరాలు చేసుకుంటున్నారో ప్రజలకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని, హైడ్రా, మూసీ ప్రక్షాళన అంటూ ప్రజల దృష్టిని మళ్ళించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌ దిట్ట అని విమర్శించారు. గృహలక్ష్మీ, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థినులకు స్కూటీలు, కొత్త పెన్షన్స్‌, రేషన్‌ కార్డులు, నిరుద్యోగులకు రూ.4వేల పెన్షన్‌ ఇలా ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందని జోస్యం చెప్పారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌ దిలీప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవీంద్రరావు, మణిభూషన్‌, బుచ్చిరెడ్డి, నాగులుగౌడ్‌, మహిపాల్‌రెడ్డి, ఎల్లేష్‌, మారం వెంకట్‌, రాంరెడ్డి, మాణిక్‌, శ్రీధర్‌గౌడ్‌, భూపాల్‌రెడ్డి, నరసింగరావు, ఆంజనేయులు, శాంతి భూషణ్‌, జితేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

పటాన్‌చెరు: స్వామియే శరణం అయ్యప్ప.. శరణుఘోషతో పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్‌ కన్వెన్షన్‌ సెంటర్‌ మార్మోగింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్‌ కన్వెన్షన్‌ సెంటర్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రాంగణంను శోభాయమానంగా అలంకరించారు. శబరిమలై నుండి వచ్చిన అర్చకులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పడిపూజ కార్యక్రమాలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్విరామంగా కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు కార్యక్రమానికి హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్‌ భూపాల్‌ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు, అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, భారీ సంఖ్యలో అయ్యప్ప స్వాములు, వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పడిపూజలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దంపతులు

నేడు పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన



పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్‌ బండి భాగ్యలక్ష్మీ శ్రీకాంత్‌యాదవ్‌ దంపతులు

శంషాబాద్‌: పట్టణంలోని రాళ్లగూడలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శుక్రవారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా ఈ నెల 2 తేదీ నుంచే ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నామన్నారు. గురువారం చండీ హవనం, దుర్గా సూక్త హవనం, హిరణ్యాధివాసం, ప్రదోషకాల పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్‌ బండి భాగ్యలక్ష్మీశ్రీకాంత్‌యాదవ్‌ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం ఆలయంలో బోనాలు సమర్పించే కార్యక్రమంతో పూజలు ముగుస్తాయన్నాని తెలిపారు.

ఫోన్‌ పోగొట్టుకున్నాడు..

రూ.2 లక్షల 29 వేలు కాజేశారు..

పటాన్‌చెరు టౌన్‌: ఆర్టీసీ బస్సులో ఓ వృద్ధుడు ఫోన్‌ పోగొట్టుకున్నాడు.. తర్వాత అతని అకౌంట్‌లో నుంచి రూ.2 లక్షల 29 వేలు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది .పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని సాయిరాంనగర్‌ కాలనీకి చెందిన ఓ వృద్ధుడు (69) గత నెల 29వ తేదీన ఆర్టీసీ బస్సులో ఫోన్‌ పోగొట్టుకున్నాడు. అయితే ఫోన్‌కు ఎలాంటి లాక్‌ లేకపోవడంతో అపరిచిత వ్యక్తులు అతని బ్యాంక్‌ ఖాతా నుండి రూ.2 లక్షల 29 వేలు డ్రా చేశారు. దీంతో బాధితులు జరిగిన ఘటనపై ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నిజాంపేట్‌: నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పరిధి మధురానగర్‌ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అష్టలక్ష్మి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళమిచ్చారు. గురువారం మధురానగర్‌ కాలనీకి చెందిన రామస్వామి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో దాతలు పాలుపంచుకోవాలని, వస్తు, ధన రూపేణా సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రావు, లింగయ్య, హేమంత్‌రావు, రామలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం మన జీవితాలపై ప్రభావం చూపుతుంది

- ఐఎఫ్‌సీ ఇండియా కంట్రీ హెడ్‌ వెండీ వెర్నర్‌
- సుస్థిర భవిష్యత్తు, నెట్‌ జీరో డైలాగ్‌పై సదస్సు

మాదాపూర్‌: వాతావరణ మార్పులు మన జీవితాలపై ప్రభావం చూపుతాయని ఏఎఫ్‌సీ ఇండియా కంట్రీ హెడ్‌ వెండీ వెర్నర్‌ అన్నారు. మాదాపూర్‌లోని అవాస హోటల్‌లో గురువారం ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా చాంబర్స్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ ఇండస్ట్రీ (ఫిక్కీ) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్‌ ఆధ్వర్యంలో సస్టేనబుల్‌ ఫ్యూచర్‌ ది నెట్‌ జీరో డైలాగ్‌ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెండివెర్నర్‌ మాట్లాడుతూ మన ఆర్థిక వ్యవస్థ, వ్యక్తిగత వ్యాపారాలు, సమాజం, గృహ భవిష్యత్తుకు ఎంతో కీలకమన్నారు. గతంలో స్థిరత్వం, లాభదాయకత, వ్యాపార లాభాలపై మాత్రమే దృష్టి పెట్టేవారని తెలిపారు. యువత పర్యావరణం సామాజిక బాధ్యతకు ప్రాధాన్యత నిచ్చే బ్రాండ్లను ఎక్కువగా ఆదరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ నేషనల్‌ కమిటీ ఎన్విరాన్‌మెంట్‌ అడ్వైజర్‌ డాక్టర్‌ పి. రాంబాబు, ఫిన్లాండ్‌ గౌరవ కౌన్సిల్‌ జనరల్‌ ఎరిక్‌ ఆఫ్‌ హల్స్‌, సందీప్‌కుమార్‌ సుల్తానియాలతో పాటు దాదాపు 300 మందికిపైగా పాలసీ మేకర్లు, కార్పొరేట్‌ నాయకులు పాల్గొన్నారు.